క్లుప్తంగా

'గేట్స్'లో హానర్ అవార్డుల ప్రదానం



అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీలో అకడమిక్ ఎగ్జామ్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి 75 నుంచి 100 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం హానర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో హానర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ నరసింహులు మాట్లాడారు. విద్యార్థులను ప్రొత్సహించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రుల సమక్షంలో హానర్ అవార్డులను ప్రదానం చేశామన్నారు. అకడమిక్ చదువుతో పాటు టెక్నికల్ స్కిల్స్‌ను కూడా పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, ప్రొగ్రామ్ కో–ఆర్డినేటర్ రజిత, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నయీామ్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో రూ.20 లక్షల వ్యయంతో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను కమీషనర్ నయీామ్ పరిశీలించారు. గురువారం కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు పనులను తనిఖీ చేసి నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం సంజీవ్‌నగర్‌లో పలు ఆక్రమణలను తొలగింపచేశారు. కార్యక్రమంలో టీపీఎస్ సత్తార్, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈర్ష్యా ద్వేషాలు వీడాలి



వద్దపర్తి పద్మాకర్ గురువును సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ ఈర్ష్యా ద్వేషాలు వీడినప్పుడే సంతోషంగా జీవించవచ్చని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు సూచించారు. గురువారం స్థానిక కన్యక పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య యువజన మహాప్రస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో సంతోషంగా జీవించడం ఎలా అనే ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ఓ లక్ష్యంతో సాగుతున్న సమయంలో ఒడుదుడుకులు వస్తాయన్నారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, ఇతరుల గురించి ఆలోచించకుండా సంతోషంగా ముందుకు సాగినప్పుడు లక్ష్యాలను ఛేదించవచ్చన్నారు. అనంతరం కమిటీ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

28 వరకూ ఆధార్ క్యాంపులు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి, కరిడికొండ, శ్రీపురం గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 28 వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ క్యాంపుల్లో ప్రజలు, విద్యార్థులు తమ ఆధార్ కార్డులలో తప్పులు, పేరు మార్పు లేదా అడ్రస్ మార్పులాంటివి సరి చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయ సిబ్బంది ఆధార్ క్యాంపులలో అందుబాటులో ఉంటాన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి శంకర్ నాయక్

శింగనమల: శింగనమల కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంటి లోపాలున్న 25 మంది విద్యార్థులకు కంటి అద్దాలను గురువారం మండల వైద్యాధికారి శంకర్‌నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంటి లోపాలున్నట్లు విద్యార్థులకు అనిపిస్తే, వెంటనే తల్లితండ్రులకు తెలియజేయాలన్నారు. వైద్యశాలకు వస్తే పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ ప్రసాద్, హెచ్‌ఎం విజయలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గీతరాణి, సూపర్‌వైజర్ ఆశ్వర్థ, ఎఎన్‌ఎం శైలజా, హెల్త్ ప్రొవైడర్ దివ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

మాలధారణతో ప్రశాంత జీవనం

- యువతలో పెరుగుతున్న భక్తి భావం
- దీక్షలపై ఆసక్తి చూపుతున్న యువకులు



యాడికిలో పాత శివాలయంలో భిక్ష చేస్తున్న శివమాలధారులు

యాడికి: యువతలో ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరుగుతోంది. శివరాత్రి పర్వదినానికి ముందు 21 రోజుతో అర్ధ మండలం, 41రోజుతో మండలం, 108 రోజులతో మహా మండలం వంటి శివమాల ధరించి దీక్షతో పూజలు చేస్తున్నారు. దీక్షలో భాగంగా తెల్లవారుజామున ఎముకలు కొరికే చలిలో స్నానం చేసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని రాయలచెరువు, చందన, వెంగన్నపల్లి, చిక్కేపల్లి తదితర గామాల్లో పలువురు భక్తులు శివ మాలధారణ ధరించారు. మండల కేంద్రంలోని పాల శివాలయం, మండలంలోని రాయల చెరువులో ఉన్న గౌరీ శంకర దేవాలయం, చందన గ్రామంలో కొండమీద ఉన్న రామప్ప దేవాలయం, కోనుప్పలపాడు గ్రామ సమీపంలోని కోన క్షేత్రంలోని కోన రామ లింగేశ్వరుడి ఆలయం వద్ద భక్తులు శివమాల ధరిస్తున్నారు.

ఇరుమడితో శ్రీశైలానికి పాదయాత్ర

శివమాల ధరించిన భక్తులు కొంతమంది 21 రోజు, 41 రోజు, మరికొంత మంది 108 రోజుల దీక్షలు చేపట్టారు. శివ దీక్ష నియమాలు పాటించిన తర్వాత ఆఖరి రోజు ఆయా గ్రామాల్లోని శివాలయంలో గురుస్వామి దగ్గర ఇరుముడి కట్టించుకుంటారు. కొంతమంది ఇరుముడి నెత్తిన పెట్టుకొని శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తారు, మరికొంతమంది శివ స్వాములు ఇరుముడి కట్టించుకున్న తర్వాత కర్నూలు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని వెంకటాపురం వరకూ కారులో ప్రయాణించి అక్కడ నుంచి అభయారణ్యంలో కాలిబాట గుండా శ్రీశైలానికి నడుచుకుంటూ వెళ్లి శ్రీశైల మల్లికార్జునుడి దర్శనం అయిన తర్వాత ఇరుముడిని స్వామివారికి అప్పగిస్తారు.

18 సార్లు మాల వేసుకున్నా



నేను ఇప్పటి వరకూ 18 సార్లు శివ మాలధారణ చేపట్టాను. మాలధారణ చేపట్టినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. శివ మాల ధరించడం అదృష్టంగా భావిస్తున్నా.

– అవుకు నాగరాజు, శివ మాలధారుడు, యాడికి మండలం

నిత్యం దైవారాధన



శివ మాల ధరించడంతో మంచి అలవాట్లు అలవడుతాయి. ఉదయం నిద్ర లేవగానే తల స్నానం చేసి నిత్యం దైవారాధన చేసే అలవాటు వచ్చింది. ఆహార అలవాట్లు కూడా మారిపోయాయి.

– చిట్టెంరెడ్డి బాలిరెడ్డి, గురుస్వామి

ఏటా 108 రోజుల శివమాల ధరిస్తా



ప్రతి ఏటా శివమాల ధరిస్తున్నా. కార్తీక మాసం నుంచి మాఘ మాసం వరకూ 108 రోజుల పాటు శివుడికి పూజ చేస్తాను. ఇరుముడి కట్టుకున్న తర్వాత శ్రీశైలం వెళ్లి పూజలు చేస్తాం.

– శ్రీనివాసులు, రాయలచెరువు గ్రామం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న ఆయా పార్టీల నాయకులు

గుంతకల్లుటౌన్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర మొండి చేయి చూపినా ఏపీకి చెందిన ఎన్‌డీఏ కూటమి ఎంపీలు, పాలకులు ప్రశ్నించకపోవడం సిగ్గుచేటని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి రామ్‌దాస్ మండిపడ్డారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మోదీ సర్కారు అన్యాయం చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏపీకి ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, పునర్విభజన హామీల అమలు గురించి ప్రస్తావించకపోయినా బాబూ సర్కారు నిలదీయకపోవడం సరికాదన్నారు. భవిష్యత్‌లో ప్రజలతో కలసి ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు.ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఆయా పార్టీల నాయకులు నాగరాజు, రమేష్, రంగమ్మ, జ్యోతి, నారాయణ, బాష, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



వివిధ కంపెనీలకు ఎంపికైన నిరుద్యోగ యువత

పామిడి: పట్టణంలోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఐదు కంపెనీల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 72 మంది హాజరయ్యారు. అందులో 36 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి, సిడాఫ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నారాయణస్వామి, చైర్మన్ దీపక్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్, విద్యార్థులు, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు జాబ్‌డ్రైవ్

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిరుద్యోగ యువతుల కోసం జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఎయిల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాల్లోపు అమ్మాయిలు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడికి స్వాగతం



రాజమహేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పామిడి: పామిడి పట్టణానికి గురువారం ఏపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రియల్ కమిటీ సభ్యుడు రాజమహేంద్రనాథ్ విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాకే గోవింద్ ఆధ్వర్యంలో స్వాగతం పలికింది. స్థానిక ఎద్దులపల్లి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన చేతులమీదుగా పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడాలని సాకే గోవిందు కోరారు. నాయకులు, సూర్యనారాయణ, రామాంజనేయులు, రాజేష్, నవీన్, ఎర్రిస్వామి, గోపాలు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరికి గాయాలు





గాయపడిన రంగస్వామి, మణికుమార్

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు సమీపంలోని జాతీయ రహదారిపై ట్రాక్టర్ , ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో కడదరగుట్టపల్లికి చెందిన రంగస్వామి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు గుత్తి నుంచి స్వగ్రామానికి కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ముందు వెళ్తున్న ట్రాక్టర్ ఉన్నఫలంగా మలుపు తిరగడంతో.. ట్రాక్టర్ ముందు బంపర్ ద్విచక్ర వాహనానికి తగిలింది. ఘటనలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వారు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రున్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

యాడికి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయమైన సంఘటన మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పిన్నేపల్లికి చెందిన మణికుమార్ ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలు దేరాడు. గుత్తి రోడ్డులో ఉన్న ఆయిల్ మిల్లు నుంచి ఓ రిక్షా యాడికిలోకి వస్తుండగా.. ఈ రెండు వాహనాలు టీ కేఫ్ సమీపంలో ఢీ కొన్నాయి. దీంతో మణికుమార్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని యాడికి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యాధికారి పరమేశ్వర సూచన మేరకు 108లో అనంతపురానికి తరలించారు.

ఎస్‌ఐని నియమించరూ..



ఖాళీగా ఉన్న ఎస్‌ఐ కుర్చీ

యల్లనూరు: యల్లనూరు పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐ లేక అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయి. ఇటీవల కాలంలో అల్లరిమూకలు, దొంగలు వరుసగా ఇళ్లల్లో చోరీలు చేస్తూ ప్రజలను నష్టపరుస్తున్నారు. దొంగలు యల్లనూరులో హల్‌చల్ చేయడంతో ప్రజలు ఇళ్లల్లో నిద్రించలేకపోతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా ఎస్పీ జగదీష్ యల్లనూరుకు ఎస్‌ఐని నియమించకపోవడంతో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. రెగ్యులర్ ఎస్‌ఐ లేక శాంతిభద్రతలు గాడి తప్పి మట్కా, పేకాట రాయుళ్లు విచ్చలవిడిగా స్థావరాలను నడుపుతున్నారు. యల్లనూరు పోలీస్‌స్టేషన్ విధులను నిర్వహిస్తున్న ఎస్‌ఐలను కొందరు సిబ్బంది ఉండనివ్వరు.. కొత్త ఎస్‌ఐలను రానివ్వరు అన్న చందంగా తయారైంది. మట్కా, పేకాట యల్లనూరు మండలంలో విచ్చలవిడిగా నడుస్తున్నా ....చేసేది లేక పోలీసులు మిన్నకుండిపోయారు. రెగ్యులర్ ఎస్‌ఐని నియమిస్తే.. శాంతి భద్రతలతో పాటు, అసాంఘిక కార్యక్రమాలు గాడిలో పడనున్నాయి. ఎస్‌ఐ లేక కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే వేదం అన్నట్లు ఉన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మాముళ్ల కోసం కానిస్టేబుళ్లు జలగల్లా పట్టి పీడిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ జగదీష్ స్పందించి ఎస్‌ఐని నియమించాలని మండలవాసులు కోరుతున్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు కేవీ రమణ, బుసా రూపావతి, ఫరూక్, వాల్మీకి శివ, ఖాజా ఖాన్ తదితరులు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్లు తదితర సమస్యలను పలుసార్లు కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తినా ఇంతవరకూ పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు పరిష్కారం కానపుడు కౌన్సిల్ సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ప్రశ్నించారు. సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం



గుత్తిలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం మాఘ మాసాన్ని పురస్కరించుకుని సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు సతీష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సం చేపట్టారు. మహిళలు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు.



తాడిపత్రిలో గో పూజ చేస్తున్న అర్చకులు

గోపూజ మహోత్సవం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని బుగ్గరామంగేశ్వర స్వామి ఆలయంలో గురువారం గో పూజ మహోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని వేద మంత్రాల నడుమ అర్చకులు గోపూజ చేశారు.సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు.

వ్యాపారాభివృద్ధిపై శిక్షణ



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఐటీఐ కాలేజీలో గురువారం మెప్మా–ఎస్ఎన్ డీసీ సంయుక్తంగా వ్యాపార అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా హాజరై మాట్లాడారు. వ్యాపారాభివృద్ధితో ప్రతి ఒక్కరూ జీవితంలో మార్పులు సాధించవచ్చన్నారు. పంబ్లింగ్, వడ్రంగి, బ్యూటీషియన్, విద్యుత్ సేవలు రిపేరీలు వంటి ఉపాధి అవకాశాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు శ్రీనివాసరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ సిబ్బంది

శింగనమల: కెనరా బ్యాంక్ సేవలను ప్రజలు, రైతులు, మహిళలు, వ్యాపారులు వినియోగించుకోవాలని బ్యాంక్ మేనేజర్ రమేష్ సూచించారు. గురువారం శింగనమలలోని దుకాణాలు, మహిళ సంఘాల సభ్యులతోను సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని కోరారు. మహిళ సంఘాలకు ఇస్తున్న రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో రీజనల్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

23న రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్లో భాగంగా ఆదివారం రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు,రెండో బహుమతి రూ.40 వేలు అందజేస్తామన్నారు. అలాగే వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు అందజేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సాయిప్రసాద్ సూచించారు. పట్టణంలోని పలు కళాశాలలు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సైబర్ నేరాలపై డిజిటల్ స్కీన్‌తో అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఏ విధంగా సైబర్ నేరాగాళ్లు మోసం చేస్తారో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్‌భాషా, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీ, గ్రామాల్లో ప్రచారం చేయిస్తూ ప్రజలు మోసపోకుండా జగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

అక్రమణల తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐ

తాడిపత్రి రూరల్: మండలంలోని బొందలదిన్నె గ్రామం వద్ద గురువారం అధికారులు తొలగిస్తున్న ఆక్రమణలను గ్రామస్తులు అడ్డుకున్నారు. తాడిపత్రి– కడప హైవే పనులకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నించారు. పరిహారం తీసుకున్న వారందరి ఆక్రమణలను తొలగించకుండా కొందరివి మాత్రమే తొలగించేందుకు ప్రయత్నించడంపై గ్రామస్తులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రజాక్‌వలి, అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, హైవే అధికారులు వచ్చి గ్రామస్తులకు సర్దిచెప్పారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొగిస్తామని వారు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

కందుల కొనుగోలు



పుట్లూరు: మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద కందుల కొనుగోలు కొనసాగుతోంది. గత రెండు రోజుల నుంచి 250 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేసినట్లు సీఈఓ గోవిందు తెలిపారు. క్వింటాల్ రూ.7550 ప్రకారం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ అయిన రైతుల నుంచి కందులు కొనుగోలు చేపడుతున్నామన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయకుమారి

యాడికి: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో నిర్వహించారు. ఎంఈఓ కాశెప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి మాట్లాడుతూ కార్యకర్తలు ఆటపాటల ద్వారా చిన్నారులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఆర్పీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

పుట్లూరు: ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అలివేలమ్మ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూలీల హాజరు విషయంలో అవకతవకలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఫారంపాండ్ల తవ్వకంతో పాటు గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏపీఓ నరేంద్ర, ఈసీ విజయ్, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఎఫ్‌టీలు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడుకు చెందిన మట్కా నిర్వాహకుడు ఇస్మాయిల్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, అతడి నుంచి రూ. 35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పప్పూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద శుక్రవారం ఇస్మాయిల్ మట్కా రాస్తున్నాడన్న పక్కా సమాచారంతో దాడులు చేశారు. కార్యక్రమంలో సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి కోటను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: రెండు వేల ఏళ్ల చరిత్ర కలిగిన గుత్తి కోటను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తికోటను గురువారం ఆయన విద్యార్థులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటపైకి విద్యుత్, తాగునీరు, రోడ్డు సదుపాయం కల్పించాలన్నారు. కనీస వసతులు కల్పిస్తే సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశ ముంటుందన్నారు. కార్యక్రమంలో కోట సంరక్షణ సమితి సభ్యులు జ్ఞానేశ్వర్ రెడ్డి,జాఫర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.